క్లుప్తంగా

టీఏసీ ఏర్పాటుకు డిమాండ్

సీతంపేట: ప్రభుత్వం వెంటనే ట్రైబుల్ అడ్వ యిజరీ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ఏజేఏసీ చైర్మన్ కె.ధర్మారావు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. మెగా డీఎస్సీలో ఏజెన్సీ పోస్టులను మినహాయించి, షెడ్యూల్డ్ ఏరియాకు ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకునే ముందు ఆదివాసీల అభిప్రాయాలు తెలుసుకునేందుకు రాజ్యాంగ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. జేఏసీ సభ్యులతో చర్చలు జరపాలని, డిమాండ్‌లు పరిష్కరించే వరకు శాంతియుతమైన ధర్మపోరాటం కొనసాగించనున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఐటీడీఏ ఆఫీస్‌ల ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు తెలిపారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



పూర్ణ కలశాలతో తిరువీధి నిర్వహిస్తున్న మహిళలు

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస గ్రామంలో కోదండరామాలయ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం మహిళలు పూర్ణ కలశాలతో తిరువీధి నిర్వహించారు. గ్రామ పురోహితులు రమేష్ శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఇంటర్వ్యూలు వాయిదా

సీతంపేట: ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం బుధవారం నిర్వహించాల్సిన ఇంటర్వ్యూ లను వాయిదా వేశామని ఎంపీడీఓ బి.బి.మిశ్రో మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.అనివార్య కారణాల వల్ల ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నామని తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా నూకాలమ్మ సంబరాలు



పాచిపెంట: గ్రామదేవత నూకాలమ్మ సంబరాలు మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. 15 ఏళ్ల తర్వాత నిర్వహించే ఈ ఉత్సవాలకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కూడా అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. పండగ నేపథ్యంలో ట్రాఫిక్ జామ్ అయింది. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు.

రోడ్డుపై తెగిపడిన విద్యుత్ వైర్లు



రంగంపేట సమీపంలో రోడ్డుపై పడి ఉన్న విద్యుత్ వైర్లు

సీతానగరం: ఈదురుగాలుల ధాటికి మండలంలోని పణుకుపేట-రంగంపేటల మధ్య బీటీ రోడ్డుపై విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. బుధవారం సాయంత్రం వీచిన గాలుల ప్రభావానికి అక్కడి విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. కరెంట్ సరఫరా లేని సమయంలో అవి పడడం, అదే సమయంలో రోడ్డు మీదుగా ఎవరూ రాకపోకలు చేయకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. ఇదే విషయంపై సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు అక్కడికి సిబ్బందితో చేరుకుని, వైర్లు బిగించే పనులు చేపట్టారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



బురదమయమైన గదబవలస-తోటపల్లి రోడ్డు



అధ్వానంగా తయారైన కుదమ-గౌరీపురం రోడ్డు



వర్షం కురిస్తే పరజపాడు-పెదకుదమ రోడ్డు పరిస్థితి ఇదీ...

రోడ్లు ఇలా... రాకపోకలు ఎలా?

జియ్యమ్మవలస మండలంలోని పలు గ్రామాల ప్రజలను రోడ్ల కష్టాలు వెంటాడుతున్నాయి. అడుగుకో గుంత, బురద రోడ్లపై రాకపోకలకు నరకయాతన పడుతున్నారు. ప్రజల కష్టాలు కళ్లకు కడుతున్నా కూటమి పాలకులు స్పందించడం లేదని, కనీసం మరమ్మతు పనులు కూడా చేపట్టడంలేదని విమర్శిస్తున్నారు. పరజపాడు– పెదకుదమ గ్రామాల మధ్య ప్రధానమంత్రి సడక్ యోజన కింద నిర్మించిన బీటీ రోడ్డు గుంతలమయమైంది. గంగరాజుపురం గదబవలస గ్రామం నుంచి తోటపల్లి వరకు కిలోమీటరుకు పైబడి మట్టిరోడ్డు అధ్వానంగా తయారైంది. వర్షం కురిస్తే చాలు రాకపోకలు బంద్ అవుతున్నాయి. గ్రామానికి బీటీ రోడ్డు వేస్తామని కూటమి నాయకులు ఇచ్చిన హామీని మరిచిపోయారంటూ గ్రామస్తులు పలువురు విమర్శిస్తున్నారు. కుదమ బీటీ రోడ్డు నుంచి గౌరీపురం, గౌరీపురం నుండి తోటపల్లికి సుమారు నాలుగు కిలోమీటర్ల బీటీ రోడ్డు గోతులతో దర్శనమిస్తోంది.

– జియ్యమ్మవలస రూరల్

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయరంగారావు

పాలకొండ రూరల్: మండలంలోని గోపాలపురం గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనుల ను ఎంపీడీఓ ఎం. విజయరంగారావు మంగళవారం పరిశీలించారు. వేతన దారుల సంఖ్యను మస్టర్ల సీట్లలో నమోదైన వివరాలను సరిపోల్చి చూశారు. అనంతరం ఆయన వేతనదారులతో మాట్లాడుతూ రెండుపూటలా పనులకు హాజరు కావాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పని ప్రదేశంలో వేతనదారులకు తాగునీరు, నీడ సదుపాయం కల్పించాలని, పనుల వద్ద ఉండా లని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: పాలకొండ-శ్రీకాకుళం, విశాఖపట్నం రహదారిలో ఎస్ఐ కె.ప్రయోగమూర్తితో కలిసి సీఐ చంద్రమౌళి మంగళవారం వాహన తనిఖీలు చేశారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వస్తున్న వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. సదరు వాహన చోదకుల లైసెన్సులు, వాహనాల ధ్రువపత్రాలను సరిపోల్చారు. పెండింగ్ చలానాలను వసూలు చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహన చోదకులు తప్పనిసరిగా లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన పత్రాలను కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బయోమెట్రిక్ పరికరాలు అందజేత



పరికరాలు అందజేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురంటౌన్: స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యారోగ్య శాఖ పంపిణీ చేసిన బయోమెట్రిక్ పరికరాలను సిబ్బందికి మంగళవారం అందజేశారు. సకాలంలో ఆరోగ్య సర్వే లక్ష్యాలు చేరుకోవడంలో ఈ పరికరాలు దోహదపడతాయని, సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో ఎస్. భాస్కరరావు కోరారు. ప్రజారోగ్యం దృష్ట్యా వైద్య సిబ్బంది పలు సర్వేలు చేయడం జరుగుతోందని, ఇందుకు గాను జిల్లాకు 695 బయోమెట్రిక్ పరికరాలు పంపిణీ చేశామని, వాటిని అన్నీ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఇంటింటి సర్వే ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్యం తనిఖీ చేసి, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు టి.జగన్‌మోహన్‌రావు, పీఎల్ రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

సాలూరు: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. మొత్తం 216 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా అన్‌రోల్‌కు 50 మంది, అప్రెంటీస్‌కు 30 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కోట్ల శ్రీనివాస్ తెలిపారు.

జీడి ప్రాసెసింగ్ యూనిట్ పనుల పరిశీలన

పార్వతీపురంటౌన్: స్థానిక మార్కెట్ యార్డు వద్ద నిర్మిస్తున్న జీడి ప్రాసెసింగ్ యూనిట్ పనులను ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనులపై ఆరాతీసి, త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని సిబ్బందిని పీవో ఆదేశించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. త్వరితగతిన వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ మణిరాజ్, ఏపీవో మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ డీసీహెచ్‌ఎస్‌గా నాగభూషణరావు



పార్వతీపురంటౌన్: డీసీహెచ్‌ఎస్‌గా డాక్టర్ జి.నాగభూషణరావును నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన పాలకొండ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తుండగా, ఇక్కడి డీసీహెచ్‌ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ బి.వాగ్దేవి స్వయంగా విధుల నుంచి తప్పుకోవడంతో ఆ స్థానంలో నాగభూషణరావు వచ్చారు. గతంలో జిల్లాలో పనిచేసిన అనుభవం తనకు ఉందని, జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తారని అందరూ ఆశిస్తున్నారు.

కిశోరీ బాలికా వికాసంపై అవగాహన అవసరం



ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది

గరుగుబిల్లి: కిశోరీ బాలికా వికాసంపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ కొమరాడ పీఓ జి.సుగుణకుమారి అన్నారు. మండల కేంద్రంలో కిశోరీ వికాసంపై ఐసీడీఎస్, వైద్య సిబ్బంది సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. 11–18 ఏళ్ల మధ్య బాలికల్లో విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన మెరుగుపరచడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పీఓ తెలిపారు. రక్తహీనత నివారణ కోసం బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు.

కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి, సిబ్బంది బి.చిన్నమ్మి, సీహెచ్ ఉదయకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ సురక్షితం



తల్లి లక్ష్మికు ఆరోగ్యవంతమైన బిడ్డను అందిస్తున్న ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులు

పాలకొండ రూరల్: విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలానికి చెందిన లక్ష్మి అనే గర్భవతికి ఏడవ నెలలోనే ప్రసవం చేయాల్సి వచ్చింది.. ఆస్పత్రి వైద్యులు 21 రోజుల కిందట శస్త్రచికిత్స చేసి 900 గ్రాముల బరువున్న బేబీని బయటకు తీశారు.. మెరుగైన వైద్యసేవలు అందించారు. తల్లీబిడ్డ ఆరోగ్యం కుదుటపడడంతో డిశ్చార్జ్ చేసినట్టు పాలకొండ విజయమల్టీ ఆస్పత్రి ఎండీ దూబ పద్మావతి తెలిపారు. ప్రీమెచ్యూర్ ఆపరేషన్‌ను విజయవంతంగా చేసి తల్లీబిడ్డలను కాపాడిన వైద్యులు చరిష్మ, సంపత్‌కుమార్‌లను మీడియా సాక్షిగా ఆమె మంగళవారం అభినందించారు.

సాగునీరందించాలని వినతి



సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

పాలకొండ: నాగావళి ఎడమ కాలువ ద్వారా రైతులకు సాగునీరందించాలని రైతు సంఘం నాయకులు సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా కాలువల్లో పూడికలు తీయకపోవడంతో పొలాలకు సాగునీరందడం లేదని వివరించారు. జలవనరుల శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని చెప్పారు.కాలువలో పూడికలు తొలగించి ఈ ఏడాది శివారు ఆయకట్టు వరకు సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సంఘం నాయకులు బుడితి అప్పలనాయుడు, రౌతు సోంబాబు, వైకుంఠరావు, రమణమూర్తి, విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



నగర పంచాయతీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పాలకొండ రూరల్: నగర పంచాయతీలో 13 నుంచి 19 వార్డుల పరిధిలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఉమామహేష్ నగర కమిషనర్ రాజరత్నంను కోరారు. నగర పంచాయతీ కమిషనర్‌ను తన కార్యాలయంలో బీజేపీ నాయకులు మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు వార్డు పరిధిలో డ్రైనేజీలు, సీసీ రహదారుల్లో ఉన్న సమస్యలను వివరించారు. గజాల కానా సమీపంలో ఉన్న శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కోరారు.

సేంద్రియం..నేలకు బలం!

- సేంద్రియ ఎరువులతో నేలతల్లికి మేలు
- పశువుల గెత్తం, గొర్రెల కొట్టంతో భూసారం
- వేసవి దుక్కులకు ముందే వేసుకోవాలి
- ఫలితంగా నాణ్యమైన పంట, అధిక దిగుబడులు



పొలాల్లో వేసేందుకు తరలిస్తున్న గెత్తం

బలిజిపేట: పంటల సాగులో సేంద్రియ ఎరువులు వినియోగిస్తే నేల సారవంతమై నాణ్యమైన, ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. పశువుల గెత్తం, గొర్రెలు, మేకల కొట్టం(వ్యర్థాలు)తో భూసారం పెరుగుతుందని, చెరువు మట్టితోనూ నేలకు మంచి పోషకాలు అందుతాయని సలహా ఇస్తున్నారు. ఖరీఫ్ సాగుకు ముందు ఈ సహజ ఎరువులు వేసుకుంటే పంట ఏపుగా పెరిగి, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యంతో పంట నిలబడగలదని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు సేంద్రియ ఎరువుల వినియోగానికి ఆసక్తి చూపిస్తున్నారు.

ఘన, ద్రవ జీవామృతాలతో మేలు..

ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పంటలకు వాడే ఘన, ద్రవ జీవామృతాలతో మేలు. మన పరిసరాల్లో లభ్యమయ్యే ఆవుపేడ, మూత్రం, వివిధ ఆకులు వంటి వాటితో తయారయ్యే ఎరువులు వినియోగిస్తే మంచి దిగుబడులు వస్తాయి. భూసారానికి, రసాయన ఎరువుల వినియోగం తగ్గించేందుకు ఆఖరి దుక్కులో ఘనజీవామృతం వినియోగించడం, పంటలలో వివిధ దశలలో ద్రవజీవామృతం వినియోగించడం, పంటలలో విత్తనం ద్వారా ఆశించే తెగుళ్ల నివారణకు బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం, మరికొన్ని పంటలలో వచ్చే తెగుళ్ల, చీడపీడల నివారణకు రసాయన రహిత యాజమాన్య పద్ధతులు పాటించడం వంటి వాటిపై వ్యవసాయ శాఖ నిత్యం రైతులకు అవగాహన కలిస్తోంది. అలాగే వరి సాగులో అధిక దిగుబడులకు లైన్ సోయింగ్ పద్ధతిని రైతులకు వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు.

కర్బన శాతం పెరుగుతుంది..


ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు సంప్రదాయ వ్యవసాయాన్ని కొనసాగించడంపై దృష్టిసారిస్తున్నారు. దీనికి వ్యవసాయ శాఖ కూడా ప్రోత్సహిస్తోంది. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు ఆర్జించేలా వారికి ప్రణాళికాబద్ధంగా సాగు విధానాలను వివరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా లభ్యమయ్యే పశువుల గెత్తం(పేడ), గొర్రెలు, మేకలు గొట్టం, చెరువులు, నీటికుంటల్లోని నల్లరేగడి మట్టి పొలాల్లో వేస్తే నేల సారవంతమవుతుంది. తద్వారా కర్బన శాతం పెరిగి మొక్కల వేర్లు సులువుగా నేలలోకి చొచ్చుకుపోయి సకాలంలో ఏపుగా పెరిగేలా దోహదపడుతుంది. రానురాను రసాయనిక ఎరువుల వినియోగం పెరగడం, వాటి ధరలు కూడా భారీగా ఉండడంతో తక్కువ ధరలకు లభ్యమయ్యే ప్రకృతి సిద్ధమైన సహజ ఎరువుల వినియోగానికి రైతులు ముందుకు వస్తున్నారు.

సేంద్రియ ఎరువులు మేలు..

రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వినియోగిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. నేల సారవంతమై మొక్కలకు అవసరమైన పోషకాలు అందుతాయి. తద్వారా ఆరోగ్యకరమైన, నాణ్యమైన పంట, అధిక దిగుబడులు వస్తాయి. పొలాలకు గెత్తం తరలిస్తే నేలకు సేంద్రియ బలం చేకూరుతుంది. రసాయనిక ఎరువుల కన్నా సేంద్రియ ఎరువులే మేలు. మంచి ఫలితాలు ఇస్తాయి.

– ఎం.శ్రావణ్‌కుమార్, ఏవో, బలిజిపేట

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



పాలకొండ రూరల్: అర్ధరాత్రి వేళ విద్యుత్ మరమ్మతుల్లో నిమగ్నమైన సిబ్బంది



భామిని: కీసరలో విద్యుత్ స్తంభాలను పాతుతున్న సిబ్బంది

పాలకొండ రూరల్: పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షం విద్యుత్‌శాఖకు భారీ నష్టం మిగిల్చింది. ఎక్కడికక్కడే విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ శాఖ అధికారులు సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. చెట్ల కొమ్మలను రాత్రి సమయంలోనే తొలగించి వేకువజామున 2 గంటల సమయానికి దాదాపు విద్యుత్ పునరుద్ధరణ చేశామని విద్యుత్ శాఖ ఏఈ శ్యామ్ సుందర్ తెలిపారు.

కొత్త విద్యుత్ లైన్ పనులు

భామిని:మండలంలోని కీసర గ్రామంలో విద్యుత్ కొత్త లైన్ ఏర్పాటు పనులను విద్యుత్ శాఖ సిబ్బంది మంగళవారం చేపట్టారు. రోడ్డుకు పక్కగా విద్యుత్ స్తంభాలను పాతి లైన్లు వేశారు. అలాగే పాత స్తంభాలను తొలగించారు. పనులను సర్పంచ్ వలరౌతు పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వలరౌతు రామకృష్ణ పర్యవేక్షించారు.

దళారులే దిక్కు..!



భామిని: మండలంలో రబీ వరి పండించిన రైతులు ధాన్యం విక్రయించుకునేందుకు కష్టాలు పడుతున్నారు. తమ కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. రబీ ధాన్యం సేకరణకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవ డంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. దళారు లు చెప్పిన ధరకే పంటను విక్రయించుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలు కురుస్తుండడంతో ఇదే అదునుగా భావించి దళారులు సిండికేట్‌గా తయారై తమకు నచ్చిన ధరకు పంటను అడుగు తున్నారని, పంటను నిల్వ చేయలేక వారి చెప్పిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. మండలం లోని నేరడి–బి.గురండి,బొమ్మిక,బిల్లుమడ కూడలిలో ధాన్యం విక్రయాలు మంగళవారం జోరుగా సాగాయి.